లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన తోట

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బ్రాహ్మణి దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు ప్రాంతంలో సాగుతున్న లోకేష్ యువగళం పాదయాత్రలో శనివారం ఆమె లోకేష్‌ను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పుష్పగుచ్ఛం అందిస్తున్న తోట సీతారామలక్ష్మి

జనాలను కలిసేదెప్పుడు..!

రోజంతా వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాల్లోనే అధికారులు

కింది స్థాయి నుంచి పైస్థాయి వరకూ ఇదే పరిస్థితి

సామాన్యులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతం

స్పందనలో ఫిర్యాదిస్తేనే స్పందిస్తున్న అధికార యంత్రాంగం

క్షేత్రస్థాయి పర్యటనలకు అధికారులు దూరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'డెల్టాలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తమ వీధిలో డ్రెయినేజీ సమస్య ఏర్పడిందని చెప్పుకునేందుకు పంచాయతీకి వెళ్తే కార్యదర్శి మీటింగ్‌కు వెళ్లారంటూ సమాధానం వస్తోంది. అక్కడున్న వారికి సమస్య చెప్పినా కార్యదర్శిని కలవాలనే సమాధానం వస్తోంది. మరోసారి వెళ్తే జూమ్ మీటింగ్‌లో ఉన్నారంటారు. దీంతో విసిగిపోయిన సదరు వ్యక్తికి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి.'

'మెట్ట ప్రాంతంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి భూమికి సంబంధించిన సమస్యను చెప్పుకునేందుకు వెళ్లినా మండల అధికారులు అందుబాటులో ఉండటం లేదు. జిల్లా కేంద్రానికి వచ్చినా ఏ ఒక్క అధికారీ దొరకని పరిస్థితి. అదేమని అడిగితే సదరు అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారంటూ సమాధానమే. దీంతో సదరు వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యాడు.'

పైన పేర్కొన్న వారే కాదు.. రెండు జిల్లాల్లోని సామాన్య ప్రజానీకం తమ సమస్యలను చెప్పుకునేందుకు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. సమస్య చెప్పుకునేందుకు వెళ్లిన జనానికి అధికారుల దర్శనమే దొరకడం లేదు. అదేమని అడిగితే ఏ రోజు వెళ్లినా సదరు అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారనో, జూమ్ మీటింగ్‌లోనో, పై అధికారుల సమావేశంలోనో ఉన్నారంటూ సమాధానమే. దీంతో జనాలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో చిన్నచిన్న సమస్యలపైనా స్పందనలో ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కిందిస్థాయిలో జరుగుతున్న స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జిల్లా కేంద్రానికి రావాల్సి వస్తోంది. భూమి మ్యూటేషన్ సమస్య గురించి మండల కేంద్రంలో తహశీల్దార్‌ను కలుద్దామంటే ఎన్నిరోజులు తిరిగినా దర్శనం దొరకడం లేదని జనం వాపోతున్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చాం, జనం తమ సమస్యలపై మండల, జిల్లా కేంద్రాలకు రావాల్సిన అవసరం లేదన్నట్లు ప్రభుత్వం తెగ ఊదరగొట్టింది. సచివాలయానికి వెళ్లి సమస్య మొరపెట్టుకున్నా ఏఒక్క సమస్యా పరిష్కారం కావడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. పైకి పంపించడం వరకే తమ పని అని, అక్కడ నుంచి సమాధానం వచ్చిన తర్వాతే తాము ఏమైనా చేయగలమని సచివాలయ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. మండలస్థాయి అధికారులు దొరకరు, జిల్లాస్థాయి అధికారులను కలవడం కలవరు అనే భావన జనంలో పెరిగిపోతుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి జనాలను కలవడం దాదాపు కనుమరుగవుతోంది. సమావేశాలతోనే అధికారులు తమ సమయాన్నంతా గడిపేస్తున్నారు. దీంతో సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయికి చేరడంలో తీవ్ర సమస్యలు ఏర్పడుతున్నాయి. భూమికి సంబంధించిన సమస్య వస్తే నెలలు తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో ప్రభుత్వం, అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సమయం, సందర్భం లేకుండా సాగిన సమావేశాలపై ప్రతిపక్షంలో ఉన్న వైసిపి తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇప్పుడు వైసిపి ప్రభుత్వం అంతకంటే దారుణంగా పరిస్థితిని మార్చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమావేశాలపై అధికారులు సైతం విసిగిపోతున్న పరిస్థితి కన్పిస్తోంది. సమావేశాలతోనే సమయమంతా సరిపోతే తాము పని ఎప్పుడు చేయాలో తెలియడం లేదంటూ అధికారులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు వినేందుకు అధికారులకు ఖాళీ లేకపోతే ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో ప్రభుత్వం చెబితే బాగుంటుంది. ఒక అధికారిని కలవాలంటే మీటింగ్ అయ్యే వరకూ కనీసంగా రెండు, మూడు గంటలు బయట వేచిచూడాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. సమావేశాలు, వీడియోకాన్ఫరెన్స్‌లు, జూమ్ మీటింగ్‌లపై ప్రభుత్వం సరైన విధానం పాటించాలని జనం కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని అంతా కోరుతున్నారు.

సమస్యలు వింటూ.. ఆప్యాయంగా పలకరిస్తూ..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ముసునూరు

జనం సమస్యలు వింటూ.. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఏలూరు జిల్లాలోని నూజివీడు నియోజకవర్గంలో రెండోరోజు శనివారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సాగింది. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి నుంచి ఉదయం ప్రారంభమైన పాదయాత్ర సింహాద్రిపురం, మండల కేంద్రం ముసునూరు మీదుగా వలసపల్లి వరకూ దాదాపు 17.2 కిలోమీటర్ల మేర సాగింది. ముసునూరు మండలం సింహాద్రిపురం గ్రామంలోకి పాదయాత్ర చేరుకోగానే మహిళలు గజమాలతో స్వాగతం పలికారు. నేలపాటివారికుంట వద్దకు చేరేసరికి 2600 కిలోమీటర్లు మైలురాయిని దాటిన సందర్భంగా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వేంపాడు కాలువ వద్ద చెక్కపల్లి గ్రామ రైతులు గజమాలతో సత్కరించారు. రాష్ట్ర సగర సంఘం నాయకులు, దళితులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ లోకేష్‌కు వినతిపత్రాలు అందించారు. బోర్డు బల్ల సెంటరు వద్ద మానం వంశీ తోడ్పాటుతో వేల్పుచర్ల గ్రామ మహిళలకు కుట్టు మిషన్లను లోకేష్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. మహిళలు, యువత, వృద్ధులతో లోకేష్ సెల్ఫీ కార్యక్రమం నిర్వహించారు.

ముసునూరులో సాగుతున్న లోకేష్ పాదయాత్ర

రచ్చబండలో జనంతో ముఖాముఖి

ముసునూరులో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న లోకేష్ దృష్టికి గ్రామస్తులు డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం, చింతలపూడి ప్రాజెక్ట్ పూర్తికాక సాగునీరు అందకపోవడం, ఎంఎల్‌ఎ అవినీతి, సంక్షేమ కార్యక్రమాల రద్దు, ఇసుక కొరత తదితర సమస్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ జగన్ తనది బటన్ ప్రభుత్వం అని పదేపదే చెబుతున్నాడని, ఇప్పుడు ఆ బటన్‌కు పవర్ పోయిందని అన్నారు. అప్పిచ్చే వాడు లేక బటన్ నొక్కినా డబ్బులు పడటం లేదని తెలిపారు. జగన్ ప్రజలపై భారాలు వేసి సంక్షేమం అంటున్నాడని విమర్శించారు. ముసునూరుకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, కొత్త రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. జగన్ చేసే సైకో పనులు చూసి సైకో అనడం తప్ప రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఏమీ చేయలేదన్నారు. టిడిపి హయాంలో ట్రాక్టర్ ఇసుక రూ.1500 ఉంటే ఇప్పుడు జగన్ పాలనలో రూ.ఐదు వేలు ఉందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు తగ్గిస్తామన్నారు. పంచాయతీ పాలనా సమస్యలపై సర్పంచి విజయలక్ష్మి వివరించారు.

పాదయాత్రకు రక్షణ కల్పించాలని ఎస్‌పికి వినతి

లోకేష్ పాదయాత్రకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని, రక్షణ కల్పించాలని టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో నేతలు జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతిని శనివారం కలిసి వినతిపత్రం అందించారు. శుక్రవారం వైసిపి శ్రేణులు, టిడిపి మధ్య జరిగిన ఘర్షణపై నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ మాగంటిబాబు స్థానిక టిడిపి నేత పాకా శ్రీను విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

నేడు పాదయాత్ర ఇలా

ఏలూరు జిల్లాలో మూడో రోజు ఆదివారం పాదయాత్ర ఇలా సాగనుంది. ఉదయం పాదయాత్రకు విరామం ప్రకటించారు. సాయంత్రం నాలుగు గంటలకు వలసపల్లి బస నుంచి యాత్ర ప్రారంభం కానుంది. 4.30 గంటలకు వలసపల్లిలో స్థానికులతో సమావేశం, 4.50 గంటలకు చింతలపూడి నియోజకవర్గంలోకి ప్రవేశిస్తోంది. 6.20 గంటలకు ధర్మాజీగూడెంలో స్థానికులతో సమావేశం, 7.50 గంటలకు మట్టంగూడెంలో స్థానికులతో సమావేశం, 8.20 గంటలకు సుందరావుపేట స్థానికులతో సమావేశం, 8.50 గంటలకు సుందరావుపేట శివార్లలో బస చేయనున్నారు.

భారీ వర్షం.. పల్లపు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణం, పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం సుమారు గంటసేపు భారీ వర్షం కురిసింది. ఉరుములు, పిడుగుపాటులతో జనం బెంబేలెత్తారు. ఉదయం ఆరు గంటల నుండి ఏడు గంటల వరకూ సుమారు గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. టిటిడి కల్యాణ మండపం రోడ్డు, మసీదు రోడ్డు, శేషమహల్ రోడ్డు, తాలుకాఫీస్ ప్రాంగణం, కడకట్ల, యాగర్లపల్లి, ఆర్‌టిసి బస్టాండు, వీకర్స్ కాలనీ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీల్లోని నీరు రోడ్లపైకి చేరడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

తాడేపల్లిగూడెంలో జలమయమైన రోడ్డు

మొగల్తూరు: మండలంలో శనివారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు నిలిచింది. గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. దీంతో రోడ్లపైకి నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నిరుపేదలకు సత్వర న్యాయమే లక్ష్యం

హైకోర్టు న్యాయమూర్తి ఎవి.శేషసాయి

నరసాపురం టౌన్:'న్యాయ వ్యవస్థ లక్ష్యం వివాదాలను పరిష్కరించడం మాత్రమే కాదు, నిరుపేదలకు సత్వర న్యాయం అందించడం కూడా' అని హైకోర్టు న్యాయమూర్తి ఎవి.శేషసాయి అన్నారు. శనివారం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్యనాయుడు ఆధ్వర్యంలో హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు, సీనియర్ అడ్వకేట్లు యామర్తి చంద్రశేఖర్, కె.చిదంబరం, గ్రంధి సివికృష్ణలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దీనికి హైకోర్టు న్యాయమూర్తులు ఎవి.శేషసాయి, రావు రఘునందనరావు, రవి చీమలపాటి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్, నరసాపురం న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎవి.శేషసాయి మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికి ఎంతోమంది న్యాయ కోవిదులను అందించిన ఘనత నరసాపురం బార్ అసోసియేషన్‌కే దక్కిందన్నారు. ఇక్కడ మెరికల్లాంటి న్యాయవాదులు ఉన్నారన్నారు. న్యాయాన్ని నిలబెట్టడానికి ఒక మార్గం న్యాయం ఆలస్యం కావడం వంటి అవరోధాలను తొలగించడమే ప్రథమ కర్తవ్యమన్నారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం వాడకం వేగంగా పెరిగిందని తెలిపారు. జిల్లా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించడానికి వీలుగా న్యాయమూర్తులతో పాటు ఇతర న్యాయ, పాక్షిక-న్యాయ అధికారులకు శిక్షణ ఇచ్చే పరిధిని పెంచాల్సిన అవసరం ఉందని హైకోర్టు న్యాయమూర్తి ఎవి.శేషసాయి అన్నారు. సన్మానగ్రహీత హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు మాట్లాడుతూ నరసాపురం తనకు గురువు లాంటిదన్నారు. న్యాయమూర్తి సివై సోమయాజులు ద్వారా ఎంతో నేర్చుకున్నానని చెప్పారు. కేసులను సమయానుసారంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి వ్యక్తికీ చివరి ఆశ్రయం న్యాయవ్యవస్థేనని, ఈ నమ్మకాన్ని కొనసాగించడానికి ఈ వ్యవస్థకు సంబంధించిన ముఖ్య వ్యక్తులుగా మనమంతా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, పదో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయదుర్గ, సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.శ్రీనివాస్, డిఎస్‌పి కె.రవిమనోహరాచారి, బార్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్ అందే మణి, కార్యదర్శి ఆర్‌జికె.బాబ్జీ, న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న న్యాయమూర్తి శేషసాయి

న్యాయవాదులకు వైద్యానికి నిధులు కేటాయించాలి : ఐలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

న్యాయవాదులకు మెడికల్ బెనిఫిట్స్ నిమిత్తం ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉభయ గోదావరి జిల్లాల కమిటీ సమావేశం డిమాండ్ చేసినది. శనివారం స్థానిక బివిఆర్ కళాకేంద్రంలో ఐలు జిల్లా కమిటీ సమావేశం వి.శైలజ అధ్యక్షతన నిర్వహించారు. మాజీ ఎంఎల్ఎ, ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 50 వేల మంది న్యాయవాద వృత్తిలో ఉన్నారని, ప్రతిరోజూ వృత్తిలో అనేక ఒడిదుడుకులకు గురై అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. అటువంటి న్యాయవాదులకు ప్రభుత్వం వైద్య సౌకర్యం కోసం నిధులు కేటాయించాలన్నారు. ప్రతినెలా రూ.పది వేలు జూనియర్ న్యాయవాదులకు స్టయిఫండ్‌గా ఇవ్వాలని, వారికి ప్రభుత్వమే ఉచిత శిక్షణ ఇవ్వాలని రాజగోపాల్ విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు వి.శైలజ మాట్లాడుతూ న్యాయవాది వృత్తిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అన్ని బార్ అసోసియేషన్లలో మహిళలకు ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో కేసుల శాతం పెరిగిందని, దానికి తగిన స్థాయిలో న్యాయమూర్తుల నియామకం చేపట్టలేదని అన్నారు. కోర్టుల్లో ఉద్యోగుల శాతం కూడా పెంచాలన్నారు. సమావేశంలో ఐలు జిల్లా కమిటీ సభ్యులు పి.వేణుగోపాలచౌదరి, కౌరు వెంకటేశ్వర్లు, పివిపివి.లక్ష్మి, జిజి.విజయభాస్కర్, ఎం.ఈశ్వరయ్య, పి.నగేష్, పి.రాజారావు, బి.లతాకుమారి, పి.వెంకట్, వై.మణికంఠ, తేజ పాల్గొన్నారు

మాట్లాడుతున్న దిగుపాటి రాజగోపాల్

డిఎన్ఆర్ ప్రయివేటీకరణను విరమించుకోవాలి

జనప్రగతి సేవాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల ప్రభాకరరావు

ప్రజాశక్తి - వీరవాసరం

భీమవరంలో ప్రఖ్యాత విద్యాసంస్థ డిఎన్ఆర్ కళాశాల ప్రయివేటీకరణను విరమించుకోవాలని ఎపి జనప్రగతి సేవాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్రం రాక ముందు నుంచి ఉన్న ఈ కళాశాల ఎంతోమంది ఉన్నత విద్యావంతులను అందించిందని పేర్కొన్నారు. డిఎన్ఆర్ కళాశాలను ప్రయివేటీకరిస్తే పెత్తందారీతనం పెరిగి ఎంతోమంది ఉత్తమ శ్రేణి విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కళాశాలలో చదివిన అనేక మంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థానంలో ఉంటూ వారి ప్రతిభను చాటారని పేర్కొన్నారు. ఎస్‌సి, బిసి, మైనార్టీ విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగే పరిస్థితులు వస్తాయని తెలిపారు. ఘనచరిత్ర కలిగిన కళాశాలను భీమవరం కేంద్రంగా జిల్లా ఏర్పడిన తరుణంలో ప్రయివేటీకరించడం దారుణమని, దీన్ని ఆపకపోతే అభ్యుదయవాదులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

తిరుమల వెళ్లే యాత్రికులకు సౌకర్యాల మెరుగుకు కృషి

టిటిడి పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు

పాలకొల్లు: జిల్లాలో తిరుమల వెళ్లే యాత్రికులకు సౌకర్యాల మెరుగుదలకు తనవంతు కృషి చేస్తానని టిటిడి సభ్యులుగా నియమితులైన మేకా శేషుబాబు చెప్పారు. పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో శనివారం జరిగిన పాలకొల్లు నియోజకవర్గ జెపిఎస్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి తనకు టిటిడి సభ్యునిగా అవకాశం కల్పించడంపై సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యాత్రికుల ఇబ్బందులను టిటిడి బోర్డు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, నేతలు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, చిలువూరి దత్తాత్రేయవర్మ, నడపన గోవిందరాజులు, గుంటూరు పెద్దిరాజు, రావూరి వెంకటరమణ, సుమంగళి, చిట్టూరి ఏడుకొండలు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి: కలెక్టర్

భీమవరం:విద్య, వైద్య ఆరోగ్య శాఖలు, సచివాలయ ఉద్యోగులు సమిష్టి కృషితో బాధ్యతగా పని చేసి మంచి ఫలితాలు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవ అభివృద్ధిని సూచించే అంశాల్లో విద్య, వైద్యం కీలక పాత్ర పోషిస్తాయన్నారు. 18 సంవత్సరాల్లోపు పిల్లలు తప్పనిసరిగా విద్య అభ్యసించాలని అన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు సమన్వయంతో సచివాలయ పరిధిలో ప్రతి గడపనూ పూర్తిగా సర్వే చేసి పాఠశాలకు వెళ్లని విద్యార్థులను గుర్తించి తప్పనిసరిగా పాఠశాలలో చేర్చాలన్నారు. పదో తరగతి, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు తప్పనిసరిగా మళ్లీ చదివేలా చూడాలన్నారు. వివాహమై పదో తరగతి ఫెయిలైన మహిళలను ఓపెన్ స్కూళ్లలో చేర్చాలన్నారు.

28 నుండి ఇంటింటా సర్వే

ఈ నెల 28 నుండి ఇంటింటా సర్వే చేసి రక్తహీనత కలిగిన మహిళలు, గర్భిణులు, బాలింతలను, కౌమార దశలో ఉన్న బాలికలను గుర్తించి వారికి వెంటనే చికిత్స ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, మెడిసిన్ కిట్లను పంపిణీ చేసి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. పెరుగుదలలో లోపం ఉన్న పిల్లలు, రక్తహీనత కలిగిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడం వల్ల జగనన్న గోరుముద్ద పథకం ద్వారా రాగి జావ, చిక్కి, గుడ్డు తప్పనిసరి చేయడంతో పిల్లలకు పౌష్టికాహారం అందుతుందని అన్నారు. గర్భిణులు, ఐదు సంవత్సరాల్లోపు పిల్లల మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో ప్రతి సచివాలయం నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. సోమవారం నుండి వారం రోజులపాటు జిఇఆర్ సర్వే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఆర్.వెంకటరమణ, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

సమీక్షలు.. యాత్రలు..!

ఎన్నికలు మరికొద్ది నెలల్లో జరగనున్న నేపథ్యంలో రెండు జిల్లాల్లో నేతలు జనంబాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రవేశించిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ యువగళం పాదయాత్ర రాజకీయాలను వేడెక్కిస్తోందని చెప్పొచ్చు. వామపక్షాలు ప్రజాసమస్యలపై వివిధ రూపాల్లో ఇప్పటికే ఆందోళనలు కొనసాగిస్తుండగా అధికార పార్టీ వైసిపి మాత్రం నియోజకవర్గాలవారీ మంత్రులు, జిల్లా అధికారుల ఆధ్వర్యాన సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ తమ ప్రజాప్రతినిధులు, నేతల ఆకాంక్షలు నెరవేర్చే ప్రయత్నం చేస్తున్నారు.

ఏలూరు జిల్లాలోకి లోకేష్ యువగళం పాదయాత్ర ప్రవేశించింది. అనూహ్యంగా మొదటి రోజే నూజివీడు నియోజకవర్గం తుక్కులూరులో వైసిపి, టిడిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. సాధారణంగా రాజకీయపార్టీలు యాత్రలు వంటి కార్యక్రమాలు చేపట్టినప్పుడు ఆయా ప్రాంతాల సమస్యలు తెలుసుకోవడం, తమ పార్టీ విధానాలు చెప్పి, ఆయా సమస్యల పరిష్కారానికి కొన్ని హామీలు ఇవ్వడం సర్వసాధారణం. ఆ తర్వాత ప్రత్యర్థులు ఆ నేతల వ్యాఖ్యలను ఖండించేవారు. ప్రస్తుతం దానికి భిన్నంగా ఒక పార్టీ యాత్ర చేస్తుంటే ప్రత్యర్థి పార్టీ కవ్వింపు చర్యలకు దిగడం షరా మామూలైపోయింది. దీనికితోడు పోలీసులు ముందస్తు జాగ్రత్తలు కొరవడటం సమస్యను జఠిలం చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. తుక్కులూరులో వైసిపి శ్రేణులు తమ పార్టీ జెండా ఊపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడటం, టిడిపి యువగళం టీమ్ దీనిపై దూకుడుగా స్పందించడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ముందుగానే వైసిపి శ్రేణులను పోలీసులు నిలువరించి ఉంటే ఈ ఘర్షణ చోటుచేసుకునేది కాదని పరిశీలకుల అంచనా. అదే సమయంలో రాజకీయ పార్టీల నేతలు సైతం తమ విధానాలను చెప్పుకుని జనాన్ని ఆకట్టుకుని ఎన్నికల్లో గెలవాలి తప్ప ప్రత్యర్థుల నోరునొక్కి తాము అధికారంలోకి రావాలనుకుంటే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటాయనేది బహిరంగ రహస్యం. ఇప్పటికైనా అధికార పార్టీ కవ్వింపు చర్యలు మాని యాత్రల సందర్భంగా తెరపైకి వస్తున్న అంశాలపై దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటే తమకే సానుకూల ఫలితాలు ఉంటాయనేది అందరి భావన. దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఇలాంటి ఘర్షణలు పునరావృతమై ప్రభుత్వానికి, ఇటు అధికారులకు చెడ్డ పేరొస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ఇక సిపిఐ బస్సు యాత్ర పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల మీదుగా సాగింది. ఏలూరు, జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం, బహిరంగ సభల్లో పోలవరం నిర్వాసితులు, పోలవరం ప్రాజెక్టు పనులు చర్చనీయాంశమయ్యాయి. 'పోలవరం పోరుకేక' పేరిట సిపిఎం పాదయాత్ర నిర్వహించినప్పటి నుంచి నిర్వాసితుల అంశం తెరపైకి వస్తుందనేది మరోసారి రుజువైంది. ఇతర పక్షాల నేతలు సైతం పోలవరం పనులు వేగవంతం చేయాలనడంతోపాటు దీనికోసం సర్వస్వం వదులుకుంటున్న నిర్వాసితుల సంరక్షణ బాధ్యత పాలకులపై ఉందని నొక్కిచెప్పడమే దీనికి నిదర్శనం. అయితే అధికారపక్షాలైన వైసిపి, బిజెపి ఏలూరులో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి రాలేదు.

సిపిఎం స్థానిక సమస్యలపై తన పోరు కొనసాగిస్తూనే ఉంది. రోడ్లు, భూములు తదితర సమస్యలపై రెండు జిల్లాల్లోనూ తన పోరు సాగిస్తోంది. పాదయాత్రలు, ధర్నాలు, మోటారు సైకిల్ ర్యాలీలు నిర్వహించి అధికారులను కదిలిస్తోంది. దీంతోపాటు ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు సైతం ఆయా కార్మికుల, ప్రజల సమస్యలపై పోరాటాలు సాగిస్తున్నాయి. గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ తమదైన శైలిలో ఆందోళనలు నిర్వహిస్తున్నాయి.

మొత్తంగా అటు టిడిపి మహాశక్తి, యువగళం పాదయాత్రలతో టిడిపి జనం వద్దకు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా జనసేన స్థానికంగా ఏదోక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇటు వామపక్షాలు ప్రజా సమస్యల గొంతుకగా నినదిస్తున్నాయి.

అధికార వైసిపి గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్న సురక్ష పేరిట జనం వద్దకు వెళ్లగా తాజాగా నియోజకవర్గాల సమీక్ష పేరిట అటు ప్రజాప్రతినిధులు, తమ నేతలు, జిల్లా అధికారుల సమక్షంలో సమీక్షలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో ఇంకా ప్రధాన సమస్యలు ఏమున్నాయి, ఏం చేయగలం అనేది చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. అయితే ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్రంలో సమావేశాలు నిర్వహించడం వల్ల ఆయా నియోజకవర్గాల ప్రజలు, ప్రజాసంఘాలు, సంస్థలు అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లే అవకాశం ఉండటం లేదు. పైగా సమస్య పరిష్కరించినా తమకు పెద్దగా ఓట్లు పడవని గుర్తించిన ప్రాంతాలను పక్కన పెడుతున్నట్లు తెలుస్తోంది. ప్రజాసమస్యల పరిష్కారంలోనూ ఓటుబ్యాంకు రాజకీయాలేమిటీ అని పలువురు పెదవివిరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లోనే సమీక్షా సమావేశాలు నిర్వహించాలని పలువురు సూచిస్తున్నారు. ఉదయం వినతులు స్వీకరించి, మధ్యాహ్నం నుంచి సమీక్షలు పెడితే ఎంతోకొంత ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం దక్కుతుందని అంచనా వేస్తున్నారు.

మొత్తంగా అటు యాత్రలు, ఆందోళనలు పేరిట ప్రతిపక్షాలు, ఇటు సమీక్షల పేరిట అధికార వైసిపి నేతల హడావుడితో జిల్లా రాజకీయం వేడెక్కిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

-వియస్ఎస్‌వి.ప్రసాద్

అవార్డు పొందిన వారిని సత్కరిస్తున్న ఎంపిపి వాసురెడ్డి

మండలాభివృద్ధికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత పరంగా నిధులు మంజూరు చేస్తున్నామని ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసురెడ్డి) అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పెనుమంట్ర సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి వాసురెడ్డి మాట్లాడుతూ మండలంలోని గరువు గ్రామంలో రూ.40 లక్షలతో నాలుగు సిసి రోడ్లు, పెనుమంట్రలో రూ.20 లక్షలతో రెండు సిసి రోడ్ల నిర్మాణాలకు మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎటువంటి అభివృద్ధి పనులకైనా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాధాన్యత పరంగా నిధులు మంజూరు చేస్తున్నామని, ఏ ఒక్కరూ అసంతృప్తి చెందవద్దని తెలిపారు. అనంతరం ఆగస్టు 15వ తేదీన కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు అందుకున్న మండలంలోని అధికారులను, ఇటీవల కాలంలో మండలం నుంచి బదిలీ అయిన అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, వైస్ ఎంపిపి వాసంశెట్టి కిరణ్, రెండో వైస్ ఎంపిపి ఈది అనిత, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, డిప్యూటీ తహాశీల్దార్ ఏలియమ్మ, వ్యవసాయ మండల సలహా మండలి మండల కమిటీ ఛైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోనే పేరుప్రఖ్యాతలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

విద్యార్థినులు మంచిగా చదువుకుని దేశానికి, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వాన్‌బ్రీ, జనరల్ మేనేజర్, హెచ్‌ఒడి ఆఫ్ ఆర్‌అండ్‌డి డాక్టర్ ఎన్.విజయకుమార్ అన్నారు. స్థానిక కళాశాల ప్రాంగణంలో ఇండ్రస్ట్రియల్, ఇన్‌స్టిట్యూషన్ కో-ఆర్డినేషన్ కమిటీ వారు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ రసాయన శాస్త్ర విద్యార్థినులకు ఫార్మా సూటికల్ ఇండస్ట్రీలో డ్రగ్ డిస్కవరీ, క్లినికల్ ట్రైల్స్, పేటెంట్ డ్రగ్, జనరిక్ డ్రగ్ మధ్య ఉన్న బేధాలను వివరించారు. ఎంఎస్‌సి పూర్తయిన తరువాత విద్యార్థినులు నెట్, స్లెట్ వంటి పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వడం వల్ల జెఆర్‌ఎఫ్, ఎస్ఆర్‌ఎఫ్, స్కాలర్‌షిప్‌లు పొందవచ్చన్నారు. వాన్‌బ్రీలో తయారయ్యే ఔషధాల గురించి విద్యార్థినులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడుతూ తణుకు పట్టణంలో వాన్‌బ్రీ లిమిటెడ్, దేవి సీ ఫుడ్స్, ది ఆంధ్రా షుగర్స్ పరిశ్రమల ద్వారా అంతర్జాతీయ ఎగుమతులు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం విజయకుమార్‌ని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనాసాయి, రసాయనశాస్త్ర అధ్యాపకులు కెవి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో వైద్యులు, యూత్ హాస్టల్ అసోసియేషన్‌వారు

జిన్నూరులో నేత్ర, దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జిన్నూరు గ్రామంలో జిన్నూరు యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పాలకొల్లు యూనిట్ ద్వారా శనివారం ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించారు. యూత్ హాస్టల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ సోమరాజు, యూత్ హాస్టల్ ఫౌండర్ రిచర్డ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో వంద మందికి పైగా పాల్గొన్న వారికి నేత్ర, దంత సేవలను డాక్టర్ చల్లా హేమంత మాదూర్, డాక్టర్ కావలి మౌని, లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్దిబోట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షులు భూపతిరాజు, అచ్యుత రామరాజు, పాలకొల్లు యూనిట్ ఛైర్మన్ కారుమూరి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు కొట్టి భాస్కరరావు, లయన్స్ ఐ హాస్పిటల్ ట్రెజరర్ కెవి.నరసింహం, ఐడియల్ స్కూల్ వ్యవస్థాపకులు ఆచంట వెంకట సుబ్బారావు, సభ్యులు బికె.విశ్వనాథ్, పెన్మత్స ప్రతాపరాజు, శ్రీకాంత్, బలభద్ర బాల రెడ్డియ్య, నాళం వెంకటరామయ్య, ఎంఎస్ఆర్‌సి గుప్త, వివిఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

సరస్వతిదేవి విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాథమిక పాఠశాలలో దాత సహ కారంతో సరస్వతిదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రధానో పాధ్యాయులు బెల్లంకొండ మురళినాగశ్రీనివాసరావు అన్నారు. వేంపాడు హిందూ ప్రాథమిక పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలు వేశారు. విద్యార్థులకు సరస్వతి దేవి భక్తి గీతాలు ఆలపించారు. శ్రీ అభిరుచి రెస్టారెంట్ అధినేత వేగేశ్న రామకృష్ణంరాజు సుమారు రూ.54 వేలతో సరస్వతి దేవి విగ్రహన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల ఎంఇఒ-1 ఎ.రవీంద్ర, ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు, దాత వేగేశ్న వంశీరాజు, ఉప సర్పంచి వేగేశ్న సుమన్, వేగేశ్న పుల్లంరాజు, కోసూరి సత్యనారాయణరాజు, వేగేశ్న సత్యనారాయణరాజు, దాత వేగేశ్న జానకిరామరాజు, ఉపాధ్యాయులు కిషోర్, వరలక్ష్మి, స్వామి, రవికుమార్‌రాజు, రామకృష్ణంరాజు, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

వేషధారణలు వేసిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

ఘనంగా రామ్మోహన్‌నాయుడు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలో టిడిపి నాయకులు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుకలను శనివారం ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి ప్రజలకు కేకు, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, మామిడిశెట్టి సత్య నారాయణ, నిప్పులేటి రామారావు, పాల రాంబాబు, బొల్లా చంటి, వెలిది పుల్లారావు, కాలా చందు, శివ, చెల్లుబోయిన పెద్దిరాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

చోరీ కేసులో నిందితుడికి జైలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ కేసులో నిందితునికి తణుకు ప్రిన్సిపల్ జూనియన్ సివిల్ జడ్జి శ్రీసాయిరామ్ ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు. గతేడాది డిసెంబర్ 20వ తేదీ రాత్రి శ్రీ దేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో రూ.1.50 లక్షలు చోరీ చేసిన కేసులో నిందితుడు వరదా దినకరకుమార్ అలియాస్ దివాకర్‌కు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెంలో..

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మదర్‌థెరిస్సా సేవలు చిరస్మరణీయమని లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య అన్నారు. మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు డైమండ్స్ లయన్స్, వశిష్ట లియో క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్స్ ఆశ్రమం చిన్నారులకు క్లబ్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య స్నాక్స్, డ్రింక్స్ అందించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారిని వెతికి మరీ సాయం చేసిన విశ్వమాత మదర్‌థెరిస్సా అని కొనియాడారు. ఆమె తన సామాజిక సేవల ద్వారా ప్రపంచస్థాయి గుర్తింపును పొందిన అమ్మ అయ్యారన్నారు. కలకత్తా మురికివాడల్లో ఆమె సేవలు స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ వెంకటేశ్వరరావు, యర్రా అంజనేయస్వామి, కె.సాయి, సత్యనారాయణరాజు, ఫణికుమార్, లియో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాధురి, సాయిశృతి పాల్గొన్నారు.

పెనుమంట్ర: పెనుమంట్ర విశ్వ హెల్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు మండలంలోని నెగ్గిపూడిలో శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘ వ్యవస్థాపకులు, జాతీయ అవార్డు గ్రహీత, డాక్టర్ సాకరాజు ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ అధ్యక్షుడు కర్రి మురళీశ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాకరాజు మాట్లాడుతూ భారతరత్న మదర్‌థెరిస్సాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు నక్కా నరేష్ పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రుల్లో ఉన్న రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు అందించారు. వాణిజ్య కాలేజీలో ఉన్న పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పాఠ్య పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు కాకర్ల వినాయక, సి.హెచ్.రవికుమార్, అబ్దుల్ గఫూర్ ఖాన్, కె.విశారద, కె.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కాశిపాడులో ఉచిత వైద్య శిబిరం

మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా శనివారం కాశిపాడు ఆరోగ్య ఉపకేంద్రం వద్ద క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో 75 మందికి షుగరు, బిపి, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారిణి పి.సంధ్య ఎఆర్‌కె. పరమేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కోట సత్యనారాయణ, రైతు భరోసా కేంద్రం అధ్యక్షులు సిహెచ్.సిల్వర్‌స్టార్ రాజు, ఆరోగ్య సహాయకులు, నాయకులు పాల్గొన్నారు.

పాలకోడేరు : ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని తన జీవితాన్ని సేవకు అంకితం చేసిన మదర్‌థెరిస్సా మహత్యాలని విస్సాకోడేరు సెయింట్ జాన్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ డిఆర్.స్వర్ణలత అన్నారు. విస్సాకోడేరు సెయింట్ జాన్స్ హైస్కూల్లో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి హెచ్‌ఎం స్వర్ణలతతో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వర్ణలత మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని నమ్మిన మొదటి వ్యక్తి మదర్‌థెరిస్సా అని అన్నారు. సేవకు మారుపేరుగా పేద ప్రజల ఆత్మబంధువుగా మదర్‌థెరిసా చరిత్రలో నిలిచిపోయారన్నారు. మదర్‌థెరిస్సా దేశానికి అందించిన సేవలు అపురూపమైనమని, ఆమెను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఆమె స్ఫూర్తితో అందరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

పాలకొల్లు : పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మదర్‌థెరిస్సా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పది మందికి కూరగాయలు, ఇస్త్రీ, టిఫిన్ బండ్లను ధర్మారావు ఫౌండేషన్ తరపున ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అందించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ తన తండ్రి పేరున సేవా కార్యక్రమాలు చేపట్టడానికి మదర్ థెరిస్సా, డాక్టర్ అంబేడ్కర్ జీవితమే ఆదర్శమన్నారు. మదర్‌థెరిస్సా, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఆనాడు ధర్మారావు ఫౌండేషన్‌ను తన తండ్రి పేరున స్థాపించి వంద మంది వికలాంగులను, వంద మంది వృద్ధులను దత్తత తీసుకుని ప్రతి నెలా వారికి ఎనిమిది కేజీల బియ్యం, వారికి అవసరమైన వస్త్రాలు, దుప్పట్లు, మెడికల్స్ ఇచ్చే కార్యక్రమాన్ని నిరంతరంగా ఇప్పటివరకు కొనసాగిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జివి, పీతల శ్రీను, కర్నేన గౌరు నాయుడు, కడలి గోపి, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఉండి: సేవకు నిలువెత్తు రూపం మదర్‌థెరిస్సా అని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షులు వేగేశ్న అనంతలక్ష్మి అన్నారు. శనివారం మదర్‌థెరిస్సా జయంతి వేడుకలను ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సుమారు రూ.1600 విలువైన పండ్లను, రొట్టెలను, బిస్కెట్లను వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఎన్నికల ప్రణాళికపై ఎస్‌పి, జెసిలతో కలెక్టర్ సమీక్ష

ఎస్‌పి, జెసిలతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లాలో క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఎస్‌పి యు.రవిప్రకాష్, జిల్లా జాయింట్‌కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ ప్రశాంతి ఎన్నికల ప్రణాళికపై సమీక్షించారు. గత ఐదేళ్లలో లోక్‌సభ, శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఎన్నికల ప్రక్రియ, బూత్ క్యాప్చర్ వంటి ఎన్నికల నేరాల కారణంగా రీపోల్ నిర్వహించిన పోలింగ్ స్టేషన్ల వివరాలు, ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి హింసకు దారితీసిన పోలింగ్ స్టేషన్ల వారీగా ముందస్తుగా నివేదికను సిద్ధం చేయాలన్నారు. గత ఎన్నికల్లో నమోదైన ఎన్నికల నేరాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో నమోదైన ఎన్నికల నేరాలు, ఆయా ప్రాంతాల్లో గతతేడాదిలో నమోదైన క్రిమినల్ నేరాలు, కుల సంఘర్షణలు, మతపరమైన సంఘటనలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలు, నగదు, వస్తువులు స్వాధీనం చేసుకున్న, అడ్డగించబడిన సంఘటనలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం నిర్బంధంలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలు, సెక్టార్‌లోని వ్యక్తుల పేర్లు, రాష్ట్ర ఎక్సైజ్ చట్టం కింద నమోదైన కేసుల సంఖ్య, ముఖ్యమైన కేసుల వివరాలు, గత సంవత్సరంలో ఆయుధాలకు సంబంధించిన సమాచారం, నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల చట్టాన్ని ఉల్లంఘించే కేసుల వివరాలు, ఎన్నికల సంబంధిత కేసుల్లో ప్రాంతం వారంటీల జాబితా, ఆ ప్రాంతంలోని అలవాటైన నేరస్తుల జాబితా (నేర వివరాలతో), ఏదైనా నిర్దిష్ట ప్రాంతంలో అసాధారణ లా అండ్ ఆర్డర్ పరిస్థితికి సంబంధించిన సమాచారం వివరాలను పొందుపరిచి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్, ఎన్నికల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యం అభినందనీయం

'శ్రీవెంకటరమణసేవా' ట్రస్ట్ నిర్మించిన ఆసుపత్రి ప్రారంభంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ

ప్రజాశక్తి - పెంటపాడు

పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందించడం అభినందనీయమని వైసిపి జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని అలంపురం గ్రామంలో శ్రీ వెంకటరమణ సేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ట్రస్ట్ ఛైర్మన్ కొలనువాడ పెద్ద కృష్ణంరాజు అధ్యక్షత వహించారు. రాజానగరం జిఎస్ఎల్ వైద్య కళాశాల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ గోగినేని తరుణ్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన రంగరాజు మాట్లాడుతూ అల్లంపురం వంటి గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి, నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాలు గ్రామీణ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఉచిత వైద్యం అందించడం కోసం ఒక భవనాన్ని నిర్మించడం, ప్రముఖ వైద్యులను రప్పించి వైద్య సేవలు అందించడం పెద కృష్ణంరాజు సేవా దృక్పథానికి నిదర్శనమన్నారు. అనంతరం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రాజానగరం జిఎస్-ఎల్ ఆసుపత్రికి చెందిన వైద్యులు, విజయవాడ న్యూరో స్పెషలిస్ట్ డాక్టర్ తీగల రమేష్, హైదరాబాదు అపోలో హాస్పిటల్ డాక్టర్ వి.రాజశేఖర్ పాల్గొని వైద్య సేవలందించారు. సభాధ్యక్షులు, శ్రీ వెంకటరమణ సేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం అందించాలనే సేవా దృక్పథంతో ఈ ఆసుపత్రి నిర్మించామని తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి నేత్ర వైద్యశాల వారి సహకారంతో నేత్ర వైద్యం, భీమవరం విష్ణు దంత వైద్యశాల వారి సహకారంతో దంత వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఈ వైద్య సేవలు నిర్వహించడానికి సహకరించిన వైద్యులు, ప్రముఖులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. సుమారు రెండు వేల మందికి ఈ మెగా వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు.

బిసిల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

శ్మశానవాటిక షెడ్డును ప్రారంభించిన ఎంపిపి చంటిరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

బిసిల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు) అన్నారు. మండలంలోని వేంద్ర గ్రామంలో రూ.13.10 లక్షలతో నిర్మించిన బిసి శ్మశానవాటిక షెడ్డును ఎంపిపి చంటిరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల కోరిక మేరకు శ్మశానవాటికలో షెడ్డును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలు, పంచాయతీ నిధులు రూ.3.10 లక్షలు ఈ షెడ్డు నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. దహన సంస్కారాలకు ఇబ్బందులు లేకుండా ఉండాలనే ముఖ్య ఉద్దేశంతో షెడ్డును నిర్మించినట్లు చెప్పారు. గ్రామంలో బిసి కులాలకు చెందిన వారంతా ఈ షెడ్డును సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా బిసిల అభ్యున్నతికి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బిసిలకు వైసిపి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కడలి నాగేశ్వరి, శ్రీవెంకట వీరబాబు, ఎంపిటిసి సభ్యులు పాలా జ్యోతి, వేంద్ర అగ్రహారం, కొండేపూడి సర్పంచులు కె.విజయలక్ష్మి, చింతపల్లి వెంకటనారాయణ (చిన్నా), గ్రామస్తులు సానబోయిన వేణు, కె.రాంబాబు, దొరబాబు, సీతయ్య, పాల శ్రీను, కమిటీ సభ్యులు టి.రామారావు, కె.పుల్లయ్య, మల్లుల కృష్ణ పాల్గొన్నారు.

షెడ్డు ప్రారంభిస్తున్న ఎంపిపి చంటిరాజు

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

చేనేత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మార్టేరుకు చెందిన చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన అధ్యక్షుడు అల్లాడ సూర్యభాస్కర్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. చేనేత కార్మికులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో చేనేత బజార్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజును కలిసిన రవిచంద్ర

ప్రజాశక్తి - పోడూరు

వైసిపి జిల్లా కమిటీలో కార్యదర్శిగా నియమితులైన కొండేటి రవిచంద్ర (వేడంగి) పార్టీ జిల్లా అధ్యక్షులు, ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనతో పాటు జెడ్‌పిటిసి సభ్యులు పెద్ది రాజు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, గణపతి రాజు, పోతుముడి రామచంద్రరావు పాల్గొన్నారు.

మేకా శేషుబాబుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమితులైన మేకా శేషుబాబును శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఇఒ యాళ్ల సూర్యనారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేకా శేషుబాబును అభినందించారు. వీరితో పాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు, సిబ్బంది ఉన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని నందమూరు గ్రామానికి చెందిన వ్యక్తి మోకాలి శస్త్ర చికిత్స నిమిత్తం మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కును ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం అందించారు. నందమూరు గ్రామానికి చెందిన పరిటాల వీరభద్ర బాపూజీకి మోకాలు శస్త్రచికిత్స నిమిత్తం సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.30 లక్షల ఆర్థిక సాయం లభించింది. ఈ చెక్కును బాపూజీ భార్య సుజాతకు మంత్రి కొట్టు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రానివాటికి నెట్‌వర్క్ ఆసుపత్రిలో కాకుండా బయట చేయించుకునే వాటికి సిఎంఆర్‌ఎఫ్ లేదా ఎల్‌ఒసి ద్వారా సిఎం జగన్ ఆర్థిక సాయం చేసి ఆదుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరు గ్రామ మాజీ సర్పంచి, సచివాలయ కన్వీనర్ కోనేటి దానయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

స్థలం పరిశీలిస్తున్న అధికారులు

డంపింగ్ యార్డు స్థల పరిశీలన

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని శృంగవృక్షం గ్రామంలో డంపింగ్ యార్డ్ ప్రతిపాదిత స్థలాన్ని శనివారం పాలకోడేరు రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గ్రామానికి డంపింగ్ యార్డ్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, స్థలాన్ని కేటాయించాలని కోరుతూ గ్రామాభివృద్ధి కమిటీ హై కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ షేక్ హుస్సేన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం నాయుడు, మండల సర్వేయర్ శ్రీనివాస్ గ్రామంలో స్థలాలను శనివారం పరిశీలించారు. వీరితో పాటు సచివాలయ సర్వేయర్ కార్తీక్, బంటుమిల్లి విఆర్ఒ అలివేలు మంగతాయారు, బంటుమిల్లి సచివాలయ కార్యదర్శి దిలీప్‌కుమార్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ ఉన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. 156/2021
O.S. 201/2015

Between:
శ్రీ దల్లి దుర్గారావు, S/o. గురువులు, హిందు, 50 సం॥లు, వ్యవసాయం, డోరు నెం. 11-22, లక్కవరం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా, JRG JCJC.
-పిటీషనరు/వాది

Vs

1. శ్రీమతి మతకల ఈస్దరమ్మ, W/o. పెంచలయ్య, హిందు, స్త్రీ, గృహిణి, 48 సం॥లు, డోరు నెం. 11-136, బి.సి.కాలనీ, R/o. లక్కవరం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.
2. శ్రీ మతకల పెంచలయ్య, S/o. నరసయ్య, హిందు, 50 సం॥లు, డోరు నెం. 11-136, R/o. లక్కవరం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.
3. శ్రీ మతకల దావీదు, S/o. పెంచలయ్య, హిందు, 25 సం॥లు, డోరు నెం. 11-136, R/o. లక్కవరం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.

-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

పై నెంబరు పిటీషను గ్రంధములో పిటీషనరు/ వాది అయిన దల్లి దుర్గారావు దాఖలు చేసుకొనిన I.A. 156/2021 in O.S. 201/2015 to enlarge the time for depositing the balance sale consideration amount కొరకు దాఖలు చేసినది అయివుంది. సదరు పిటీషనుపై మీకు ఎన్నిమార్లు కోర్టు ద్వారాను మరియు పోస్టు ద్వారాను నోటీసులు పంపించినప్పటికీ వాటినీ అందుకొనకుండా ఉద్దేశపూర్వకముగా Avoid చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం Substitute Service పేపరు ప్రకటన ద్వారా R1 to R3 లకు తెలియపరచడమైనది. పై పిటీషనుపై మీ యొక్క అభ్యంతరాలను **ది. 05-09-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల పిటీషను మీ పరోక్షం తీర్మానించబడును.

ఎన్.వి.సుబ్బారావు, అడ్వకేట్
కొవ్వూరు-534350
సెల్: 9440330449

హిస్టరీ ఆఫ్ ఇండియన్ జర్నలిజం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మాడభూషి కృష్ణప్రసాద్ రచించిన హిస్టరీ ఆఫ్ ఇండియన్ జర్నలిజం పుస్తకాన్ని బీహార్ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సురేంద్ర రామ్ పాట్నాలో ఆవిష్కరించారు. బీహార్ విధాన మండలి ఉప భవనం సమావేశ మందిరంలో శనివారం ప్రారంభమైన ఐజెయు జాతీయ కార్యవర్గ సమావేశాల ప్రారంభ సభలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐజెయు అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. రచయిత కృష్ణప్రసాద్‌ను బీహార్ కార్మిక మంత్రి సురేంద్ర రామ్ శాలువాతో సత్కరించారు. పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని పాట్నా జాతీయకార్యవర్గ సమావేశంలో నిర్వహించడంపై ఎపియుడబ్ల్యూజె అధ్యక్షుడు ఐవి.సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

ప్రజాశక్తి - ఉండి

ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ టిటిడి చరిత్రను తిరగరాసి పాలకవర్గంలో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించిన సిఎం జగన్‌కు నాయీ బ్రాహ్మణులు రుణపడి ఉంటారని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి మలువలస వీర వెంకటసత్యనారాయణ అన్నారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిద్ధపటం యానాదయ్యను టిటిడి పాలక మండలి సభ్యుడిగా నియమించినందుకు ఉండి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సంఘం ఉండి అధ్యక్షులు మల్లువలస అప్పారావు అధ్యక్షతన ఉండి సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. నాయీ బ్రాహ్మణుల పట్ల, పురాతన సంప్రదాయాలకు విలువలు ఇచ్చి సిఎం జగన్ చేసిన కృషికి తాము ఎల్లప్పుడూ కృతజ్ఞతా భావంతో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు మలువలస రవీంద్రనాథ్ (రవి), ముత్యాలపల్లి రాంబాబు, సత్యనారాయణ, చంద్రరావు, దుర్గారావు, అప్పారావు, వీర్రాజు, ప్రసాద్, సాంబశివ పాల్గొన్నారు.

In The Court Of The Ist Additional Junior Civil Judge Bhimavaram
O.S.No. 86/2022

Plaintiff: Hasibul Malik
Defendant: Killada Siva Sankar
Defendant Address:
Killada Siva Sankar, S/o. Subrahmanyam, R/o. D.No. 24-9-3, Ram Lakshan Bazar, Bhimavaram, West Godavari District.

పై నెంబరు దావాలో ప్రతివాదికి దావా సమన్లు కోర్టు ద్వారా, పోస్టు ద్వారా ఎన్ని పర్యాయములు పంపించినప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా నిరాకరించుచున్నారు. సదరు ప్రతివాదికి ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా దావా సమన్లు పంపించుటకు పై కోర్టు వారు ఆర్డరు వేసినారు. సదరు దావా **ది. 11-09-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల ప్రతివాది పరోక్షమున ఈ దావా తీర్మానించబడును.

JOSEPH EATHAKOTA
Advocate, Bhimavaram.
Cell: 94401 15975

వేలం నిమిత్తం బహిరంగ ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

F.D.I.A.3/2023 in O.S.159/2005

బిట్వీన్:
సత్తి శ్రీనివాసరెడ్డి వారు ...పిటీషనరు /వాది
మరియు
ద్వారపూడి నాగిరెడ్డి వగైరా
...ప్రతివాదులు /రెస్పాడెంట్లు

పై నెంబరు దావా గ్రందములో మీపై అనగా 1) ద్వారంపూడి నాగిరెడ్డి, తండ్రి: సత్యనారాయణ రెడ్డి, డో.నెం. 10-78, పెంటపాడు మరియు 2) కర్రి నాగిరెడ్డి, తండ్రి: సత్యనారాయణ రెడ్డి, పోస్టు బేసిక్ స్కూల్ దగ్గర, పెంటపాడు మరియు 3) చింతా పావని, భర్త: చింతా శివారెడ్డి, రెడ్డి రామాలయం దగ్గర, పసలపూడి అను వారలపై సత్తి శ్రీనివాసరెడ్డి గారు దావా వేసి ప్రిలిమినరీ డిక్రి పొందియున్నారు. శ్రీ కోర్టు వారు షెడ్యుల్ దాఖల ఆస్తిని పై కోర్టులో వేలం వేయుటకు **ది. 25-09-2023 తేది ఉదయం 10॥30 ని॥ల లగయితు వేలం వేసి డిక్రీ బాకీ వసూలు చేయుటకు కోర్టు వారు నిర్ణయించి యున్నారు.** షెడ్యూలు ఆస్థిని కావలసిన వారు కోర్టులో వేలంపాట యందు పాల్గొని కోర్టు వారు షరతుల ప్రకారం షెడ్యులు ఆస్తిని వేలంలో కొనుగోలు చేయుటకు వేలంలో పాల్గొనుటకు ఈ బహిరంగ ప్రకటన ద్వారా ప్రకటించడమైనది. కావున వేలంలో పాల్గొనదలసిన వారు ది.25-09-2023 తేది ఉదయం 10॥30 ని॥లకు పై కోర్టు ఎదుట హాజరు పై వేలంలో పాల్గొనవచ్చును. ఇ.సి. లావాదేవీలు ఏమియు లేదు.

షెడ్యూలు ఆస్తి వివరం

ఐటమ్ 1: పశ్చిమ గోదావరి జిల్లా, పెంటపాడు మండలం, పెంటపాడు సబ్ రిజిస్ట్రార్‌లోని పెంటపాడు గ్రామం తాలూకు అసెస్మెంటు నెం. 1025లో డోర్ నెం. 10-62లో తూర్పు వైపు గల రెండు ఐటమ్స్ 89-3 చ॥గ॥ అందలి తాటి ఆకుల ఇల్లుకు హద్దులు:
తూర్పు: కర్రి సుబ్బిరెడ్డి గారి స్థలం (ప్రస్తుతం వెంకటరెడ్డి) ***దక్షిణం:*** మల్లిడి సుబ్బిరెడ్డి గారి స్థలం. ***పడమర:*** మాడెం నారాయనమ్మ గారి ఇల్లు. ***ఉత్తరం:*** రాజ వీధి. ఈ హద్దుల మధ్య 56-4 చ॥గ స్థలంలో తాటియాకుల ఇల్లు.
ఐటమ్ 2: పశ్చిమ గోదావరి జిల్లా, పెంటపాడు మండలం, పెంటపాడు సబ్ రిజిస్ట్రార్లోని పెంటపాడు గ్రామ తాలూకు అసెస్మెంటు నెం. 1205లో డోర్ నెం. 10-62లో తూర్పు వైపు గల రెండు ఐటముల స్థలము మరియు తాటియాకుల ఇల్లు 89-3 చ॥గ॥ ఆస్తికి హద్దులు:
తూర్పు: మాడెం నారాయణమ్మ గారి స్థలం. ***దక్షిణం:*** మల్లిడి సుబ్బిరెడ్డి గారి స్థలం. ***పడమర:*** వెలగల రామిరెడ్డి గారి స్థలం. ***ఉత్తరం:*** రాజవీధి.

ఈ హద్దుల మధ్య 32-3 చ॥గ స్థలం మరియు తాటియాకుల ఇల్లు, రెండు ప్రతులు వెరసి 89-3 చ॥గ॥లు మొత్తము అందలి విద్యుత్ నీరు, నిధి నిక్షేపాలు, చెట్లు, దారి మార్గము వగైరా యావత్తుతో వాది గారి విలువ రెండులక్షలు.

అడ్వకేట్స్
గంగిరెడ్ల సాయి కృష్ణ ప్రసాద్
98483 77977
ముత్తా రామారావు
94411 71612
తాడేపల్లిగూడెం.

తాడేపల్లిగూడెం,
23-8-23.